క్లుప్తంగా

నేటి నుంచి యోగా తరగతులు

జడ్చర్ల టౌన్: ఆర్యవైశ్య సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 6 గంటల నుంచి యోగా తరగతులు నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు మేడిశెట్టి రామకృష్ణ తెలియజేశారు. శివానంద ఆచార్య ఆధ్వర్యంలో తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. వ్యాయామాలు, ఆసనాలు, ధ్యానం, సూర్యనమస్కారాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు నేర్పించటంతోపాటు అమృత ఆహారం అందిస్తామని తెలిపారు.

వీరభద్రుడికి లక్ష బిల్వార్చన



నవాబుపేట: లోకిరేవు వీరభద్రస్వామికి మంగళవారం ఘనంగా లక్షబిల్వార్చన చేశారు. ఆలయ పీఠాధిపతి లింగయ్యస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమం సాగింది. దీంతో పాటు లక్ష కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రావణమాసం సందర్భంగా వీరభద్రుడు నిత్యం విశేషపూజలు అందుకొంటున్నాడు. కాగా మంగళవారం పూజల అనంతరం అన్నదానం చేశారు.

నారాయణ గురు ఆశయాలను సాధిద్దాం



జడ్చర్ల టౌన్: నారాయణ గురు ఆశయాలను సాధిద్దామని నాయకులు అన్నారు. పట్టణంలో ఆయన జయంతిని బీసీసేన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్, ఆయా సంఘాల నాయకులు శేఖర్, సురభి విజయ్‌కుమార్, గోపాల్, భీంరాజ్, ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్, చాపల శ్రీనివాస్, రాములు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందవద్దు

రాజాపూర్: బ్యాంకుల్లో రూ.రెండు లక్షలకు పైగా రుణాలు ఉన్న రైతులు రుణమాఫీ విషయంలో ఆందోళన చెందవద్దని నూతనంగా బదిలీపై వచ్చి బాధ్యతలు తీసుకున్న మండల వ్యవసాయశాఖ అధికారి ప్రదీప్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం రైతువేదికలో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి తమకు ఇంకా గైడ్‌లైన్స్ రాలేదన్నారు. వచ్చిన వెంటనే గ్రామాల్లో రైతులకు ఏఈఓలు తెలియజేస్తారని అన్నారు. అంతవరకు రైతులు ఇబ్బందులు పడుతూ మండల కేంద్రానికి రావాల్సిన అవసరం లేదని సూచించారు.

అడ్డాకులలో క్విజ్ పోటీలు



అడ్డాకుల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. ఇన్ టచ్ సంస్థ, నేషనల్ హెరిటేజ్ ఆధ్వర్యంలో ప్రాచీన సంస్కృతి, వారసత్వం, కట్టడాలపై అవగాహన కల్పించడానికి విద్యార్థులకు మండల స్థాయి క్విజ్ పోటీలను ఏర్పాటు చేశారు. అడ్డాకుల పాఠశాలకు చెందిన ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు అఫ్రీన్, ఈర్ల శ్రీలత క్విజ్ పోటీల్లో టాపర్లుగా నిలిచారు. వీరిద్దరికి నగదు బహుమతులను అందజేసి పోటీలో పాల్గొన్న విద్యార్థులందరికి సర్టిఫికేట్లను అందజేశారు. ఇద్దరు టాపర్లు ఈనెల 28న జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఇంచార్జి హెచ్‌ఎం షమీ, నిర్వాహకులు జుర్రు నారాయణ, నీలిమ, దొరబాబు, అరుణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రూరల్ మండలానికి చెందిన 60 మందికి షాదీముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కులను మంగళవారం క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పథకాలన్నీ అమలు చేస్తున్నామని.. కానీ కేటీఆర్, హరీష్‌రావు లేనిపోని ఆరోపణలు చేస్తూ రైతులను, ప్రజలను ఆందోళనకు గురిచేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అదే విధంగా క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యెన్నంకు బ్రహ్మకుమారీ సంస్థ సభ్యులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మహాదేవి, సరళ, రూప తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలో విద్యుద్ఘాతంతో మరణించిన వ్యక్తుల కుటుంబాలకు సదరు శాఖ నుంచి చెక్కులు మంజూరయ్యాయి. కాగా వాటిని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఏడీఈ మద్దిలేటి, ఏఈ షకీల్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

తాగునీటికి తప్పని పాట్లు



గండేడ్‌లో ట్యాంకర్‌తో నీటి సరఫరా

- పట్టించుకోని అధికారులు

గండేడ్: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా సక్రమంగా లేకపోవడం, స్థానిక వనరులు మరమ్మతుకు నోచుకోకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. బిందెడు నీటి కోసం పడరాని పాట్లు పడాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి మండలంలో 49 పంచాయతీలు ఉండగా 52 అనుబంధ గ్రామాలు ఉన్నాయి. కాగా నీటి సరఫరా నిమిత్తం 93 ఓ ఆర్ హెచ్‌ఎస్ కొత్త ట్యాంకులు ఉండగా, 20 పాత ట్యాంకులు ఉన్నాయి. వీటితో పాటు 350 సింగిల్ ఫేజ్ మోటార్లు, ట్యాంకులకు నీరందించే 50 బోరు మోటార్లు ఉన్నాయి. వీటికింద రెండు మండలాల్లో కలిపి దాదాపు 19,959 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. కాగా కొత్త, పాత ట్యాంకులను మిషన్ భగీరథ నీటికి అనుసంధానించారు. వీటి ద్వారానే నీటి సరఫరా సాగేది. కానీ కొంతకాలం నుంచి నీటి సరఫరాలో సమస్యలతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆయా గ్రామాల్లో నీటికి గోస పడాల్సి వస్తోంది. మహమ్మదాబాద్ పరిధిలో కొంత మెరుగైన పరిస్థితే ఉన్నా.. గండేడ్ పరిధిలో మాత్రం తీవ్రంగా నీటి సమస్య వేధిస్తోంది.



రెడ్డిపల్లి గ్రామస్తులు నిలదీయడంతో సాగుతున్న పైప్‌లైన్ పునరుద్ధరణ

మిషన్ భగీరథ సరఫరాలో అంతరాయం...

గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాకు తరుచుగా అంతరాయం ఏర్పడుతోంది. ముఖ్యంగా చించోళి మహబూబ్‌నగర్ రోడ్డు జాతీయ రహదారిగా గుర్తించడంతో విస్తరణ జోరుగా సాగుతోంది. ఈ క్రమంలో మిషన్ భగీరథ పైపులు తీసి కొత్తగా తవ్వి వేస్తున్నారు. దీంతో కొన్నిచోట్ల తరుచుగా రోజుల తరబడి సరఫరా నిలిచిపోతోంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు నీటికోసం అవస్థ పడాల్సివస్తోంది. దీనికి తోడు మిషన్ భగీరథ వచ్చాక స్థానిక వనరుల వినియోగం కూడా తగ్గిపోవడంతో ఇప్పుడు ఎలాంటి సౌకర్యం లేకుండా పోతోంది. ముఖ్యంగా మండల కేంద్రంతో పాటు కొంరెడ్డిపల్లి, సల్కర్‌పేట్, రంగారెడ్డిపల్లి, రెడ్డిపల్లి తదితర గ్రామాల్లో పనులు జరిగేటపుడు నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో వెన్నాచేడ్, కొండాపూర్, పీర్లబండతండా, రంగారెడ్డిపల్లి ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం కూడా చాలా గ్రామాల్లో సమస్య నెలకొంది. రెడ్డిపల్లికి గ్రామానికైతే నీటి సరఫరా చేసే పైపులైను పగిలిపోవడంతో దాదాపు మూడు నెలలుగా నీరందలేదు. దీని గురించి అధికారులు, రోడ్డు కాంట్రాక్టర్లు పట్టించుకోలేదు. రెండు రోజుల క్రితం గ్రామస్తులు గట్టిగా నిలదీయడంతో సరఫరా పునరుద్ధరణ పనులు చేపట్టారు. నీటి ఎద్దడి నెలకొనడంతో రెడ్డిపల్లి, గండేడ్, వెన్నాచేడ్ తదితర గ్రామాల్లో ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నారు. కానీ అవి ఏమాత్రం సరిపోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం స్థానికంగా ఉన్న వనరుల నైనా అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి బోర్లు వేయించినా కొన్ని మాత్రమే ప్రస్తుతం పనిచేస్తున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికైనా సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రిడ్ సమస్య వల్లే అంతరాయం..

గ్రిడ్ సమస్య వల్లే నీటి సరఫరాలో సమస్య తలెత్తుతోంది. శ్రీశైలం నుంచి వచ్చే ప్రధాన లైన్లు తరుచుగా పగలడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతోపాటు స్థానికంగా రోడ్డు పనులు జరుగుతుండడం వల్ల గ్రామాలకు నీరందడం లేదు. స్థానికంగా ఉన్న వనరులూ అందుబాటులో లేవు. విషయాన్ని ఎప్పటికపుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం. ప్రధానంగా సమస్య ఉన్నచోట ట్యాంకర్లతో సరఫరా చేయిస్తున్నాం. ఇది సరిపోకపోతే సింగిల్ ఫేజ్ మోటార్లు మరమ్మతు చేయించి సమస్య లేకుండా చూస్తాం.

– రామకృష్ణ, ఏఈ మిషన్ భగీరథ, ఉమ్మడి గండేడ్ మండలం

విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తదితరులు

రాజాపూర్: రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. మంగళవారం కుచ్చర్‌కల్ ప్రాథమికోన్నత పాఠశాల వద్ద నిర్మించనున్న ప్రహరీ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పనులు చేస్తామని పేర్కొన్నారు. ప్రహరీని నాణ్యతతో నిర్మించాలని సూచించారు. పాఠశాల భవనం శిథిలావస్థలో ఉందని కొత్తది మంజూరు చేయాలని హెచ్‌ఎం సమతాదేవి ఎమ్మెల్యేను కోరారు. కాగా ఆయన స్పందిస్తూ మినరల్ వాటర్ ప్లాంట్ మంజూరు చేస్తానని, కొత్త భవనం వచ్చేందుకు కృషిచేస్తానని వివరించారు. రాజాపూర్ తహసీల్దార్ కార్యాలయం నిర్మించేందుకు ఎకరం స్థలం సేకరించాలని లేనిచో రంగారెడ్డిగూడలో నిర్మిస్తామని అన్నారు. కాగా స్థలం ఉందని స్థానిక నాయకులు ఆయనకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడాతూ.. గత ఎమ్మెల్యే శిలాఫలకాలు వేసి రెండేళ్లయిన పట్టించుకోలేదన్నారు. విద్యార్థులకు షూస్‌తో పాటు వచ్చే సంవత్సరం నుంచి బ్యాగ్, వాటర్‌బాటిళ్లను సైతం సొంత ఖర్చులతో అందిస్తానని తెలిపారు. ఎంపీడీఓ మశ్చందర్, నాయకులు నరహరి, చంద్రకాంత్‌గౌడ్, కృష్ణయ్యగౌడ్, మోటెసత్యం, వెంకటయ్య, గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు షూ పంపిణీ

జడ్చర్ల: విద్యార్థుల సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలో పర్యటించారు. మాచారంలో వాల్మీకి ఆలయాన్ని సందర్శించారు. మాచారం, కోడ్గల్, గంగాపూర్ గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు షూ పంపిణీ చేశారు. తన సొంత డబ్బుతో పంపిణీ చేస్తున్నానని.. బీఆర్‌ఎస్ నాయకులు అసత్య ప్రచారాలు మానుకోవాలన్నారు. కానీ గత పాలకులు మాత్రం పరిశ్రమల నుంచి డబ్బులు వసూలు చేసి తమ సొంత సంస్థ పేరుతో పంపిణీ చేశారని ఆరోపించారు. దీనిపై గంగాపూర్ చెన్నకేశవస్వామి వద్ద ప్రమాణం చేద్దామా అంటూ సవాల్ విసిరారు. ఎంఈఓ మంజులాదేవి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలపై విచారణ



సమస్యలు విన్నవిస్తున్న కార్మికులు

జడ్చర్ల టౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యలపై జెడ్పీసీఈఓ వెంకట్‌రెడ్డి మంగళవారం స్థానిక కార్యాలయంలో విచారణ పేట్టారు. కార్మికులను ఒక్కొక్కరిని పిలిచి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వారితోపాటు మిగతా అందరితోనూ మాట్లాడారు. కాగా వారు పీఎఫ్, ఈఎస్ఐల గురించి వివరించారు. ఇప్పటి వరకు 22మంది కార్మికులు మృతిచెందారని ఆయన దృష్టికి తెచ్చారు. అయితే సమయా భావం వల్ల తాను త్వరగా వెళ్తున్నానని, మరోసారి వచ్చి పూర్తి స్థాయిలో విచారణ చేస్తానని వారికి హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యేకు వినతి

స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి గంగాపురంలో సీఐటీయూ నాయకులు కిల్లెగోపాల్ నేతృత్వంలోని కార్మికులు తమ సమస్యలను విన్నవించారు. పీఎఫ్ సమస్య గురించి తెలియజేశారు. కమిషనర్ సమస్యలను పక్కదోవ పట్టించి తప్పుడు సమాచారం ఇస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే వారు అందించిన వినతిపత్రాన్ని వెంటనే కలెక్టర్‌కు ఫార్వర్డ్ చేశారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై దృష్టిపెట్టాలి

భూత్పూర్: ఎల్‌ఆర్‌ఎస్ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై అధికారులు దృష్టిపెట్టాలని, త్వరితగతిన పెండింగ్ దరఖాస్తులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. మంగళవారం భూత్పూర్ మున్సిపాలిటీలోని నాలుగో వార్డులో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు చేసుకున్న వారి ప్లాట్లను ఆయన పరిశీలించారు. మున్సిపాలిటీలో ఎన్ని ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు వచ్చాయి.. ఓపెన్ ప్లాట్లు, లేఅవుట్లకు సంబంధించి ఎన్ని దరఖాస్తులను పరిశీలించారని ఆర్‌ఐ బాలసుబ్రమన్యంను అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీలోని 10 వార్డులకు సంబంధించి 6 వేల దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిశీలిస్తున్నామని ఆర్‌ఐ వివరించారు. మున్సిపాలిటీలో ఉన్న ఓపెన్ ప్లాట్లతో లే అవుట్లను రెగ్యులరైజ్ కోసం దరఖాస్తుదారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాలని, ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పెండింగ్ లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట కమిషనర్ సురేందర్‌రెడ్డి, ఆర్‌ఐ నర్సింహులు, వార్డు ఆఫీసర్, తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

మహబూబ్‌నగర్ క్రైం: వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రికవరీ చేసిన సెల్‌ఫోన్లను బాధితులకు మంగళవారం ఎస్‌ఐ శీనయ్య అందించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడారు. కూరగాయల మార్కెట్, షాపింగ్ మాల్స్‌కు వెళ్లిన సందర్భాల్లో ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులకు ఫోన్‌లు ఇవ్వడం, ఓటీపీలు చెప్పడం చేయరాదన్నారు. కానిస్టేబుల్ పవన్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

జడ్చర్ల: కిష్టారంనకు చెందిన అనిత(45) శనివారం నుంచి కనిపించకుండా పోయిందని ఏఎస్‌ఐ నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. అనిత హైదరాబాద్‌లో ఉన్న తన కుమార్తె శ్వేత దగ్గరకు వెళ్లాలనుకుంది. దీంతో ఈనెల 17న భర్త జంగిరెడ్డి ఆమెను జడ్చర్ల కొత్త బస్టాండ్‌లో హైదరాబాద్ బస్సు ఎక్కించాడు. కాగా అదేరోజు రాత్రి 9 గంటల ప్రాంతంలో శ్వేత ఫోన్ చేసి అమ్మ రాలేదని చెప్పింది. దీంతో చుట్టుపక్కలా.. బంధువుల దగ్గర వెతికినా ప్రయోజనం లభించలేదు. ఈ మేరకు మంగళవారం ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ వివరించారు.

పాలమూరులో భారీవర్షం



అలుగు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌రెడ్డి



మున్ననూర్ వద్ద ప్రవహిస్తున్న దుందుభీ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో మంగళవారం తెల్లవారుజాము నుంచి ఉదయం ఎనిమిది గంటల వరకు భారీ వర్షం కురిసింది. దీంతో 30.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. పట్టణంలోని ఓపెన్ నాలాలు, పాటు కాల్వలు వరద నీటితో నిండిపోయాయి. లోతట్టు ప్రాంతాల్లోని వీధులలో రోడ్లపైకి వర్షపు నీరు చేరింది. విలీన గ్రామాల్లో మట్టిరోడ్లన్నీ బురదమయంగా తయారయ్యాయి. కాగా, రామయ్యబౌలి వైపు పెద్దచెరువు (మినీ ట్యాంక్‌బండ్) అలుగును మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి పరిశీలించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. ఇక ఖూన్సీనగర్‌కాలనీ (వార్డు నం.46) లోని ఓ పాత ఇంట్లో నివసిస్తున్న వారి వద్దకు ఆర్‌ఐ రమేష్ చేరుకుని మాట్లాడారు. సురక్షితమైన ప్రదేశానికి తరలివెళ్లాలని వారికి సూచించారు.

మిడ్జిల్: మండలంలో మంగళవారం ఉదయం 2 గంటల పాటు ఎడతెరిపి లేకుండా భారీవర్షం కురిసింది. మున్ననూర్ దగ్గర ఉన్న దుందుభీ వాగు ప్రవహించడంతో మండలంలో రైతులు భూగర్భ జలాలు పెరుగుతాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వివరాలు సమర్పించాలి



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మండల పరిధిలోని ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు సంబంధించిన విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలని డీఈఓ రవీందర్ పేర్కొన్నారు. ఆయా సంస్థల యాజమాన్యాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి వివరాలను పెన్ నంబర్‌తో నమోదు చేయాలని, ఈనెల 21లోగా పూర్తి వివరాలను ఇవ్వాలన్నారు. ఇన్‌స్పైర్ అవార్డుల విషయంలో యూపీ స్థాయి నుంచి హైస్కూల్ స్థాయి వరకు ప్రతి పాఠశాల నుంచి కనీసం 5 నామినేషన్‌లు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షల విభాగానికి సంబంధించి డీడీ రూపంలో డబ్బు చెల్లించాలని ప్రక్రియ ఈనెల చివరిలోగా పూర్తి చేయాలన్నారు. ఏఎంఓ శ్రీనివాస్, డీసీబీ సెక్రటరీ వెంకట్‌రాములు, సంపత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

నవాబుపేట: సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి.. అవి సోకకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని మండల వైద్యాధికారి శ్రీజా తెలిపారు. మంగళవారం మండలకేంద్రంలో ప్రపంచ దోమల నివారణ దినోత్సవం నిర్వహించారు. ర్యాలీ చేపట్టి దోమల వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు ఎక్కువగా దోమల వల్లే వస్తాయని వివరించారు. అందువల్ల వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. నీటిని నిల్వ ఉంచరాదని సూచించారు. యన్మన్‌గండ్లలో మంగళవారం టీబీ శిబిరం నిర్వహించారు. 119 మందికి వివిధ రకాల వైద్యపరీక్షలు చేశారు.

క్లస్టర్‌లకు కొత్త అధికారులు

నవాబుపేట: మండలంలోని వ్యవసాయ శాఖలో 5 క్లస్టర్‌లకు కొత్తగా ఏఈఓలు బదిలీపై వచ్చినట్లు మండల అధికారి కృష్ణకిషోర్ తెలిపారు. మంగళవారం కొత్త ఏఈఓలు విధుల్లో చేరినట్లు ఆయన వివరించారు. నవాబుపేటకు ఆనంద్‌నాయక్, రుద్రారానికి శంకరమ్మ, లింగంపల్లికి నవతేజా, ఇప్పటూర్‌కు మణికంఠగౌడ్, కొల్లూర్ క్లస్టర్‌కు మానస వచ్చారని పేర్కన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



జడ్చర్లలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటి పరిధిలోని 10వ వార్డులో ఉన్న పోచమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. జడ్చర్ల, కావేరమ్మపేట ప్రజలు బోనాలు సమర్పించేందుకు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. దీంతో రోడ్లన్ని రద్దీగా మారాయి. వేడుకలో పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్‌లు వేర్వేరుగా పాల్గొన్నారు.

మిడ్జిల్: వస్పుల, దోనూర్ గ్రామాల్లో మంగళవారం పోచమ్మ, మైసమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు.

అడ్డాకుల: మూసాపేట మండలం చక్రాపూర్ గ్రామంలో మంగళవారం పోచమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు.



చక్రాపూర్‌లో బోనాలను ఊరేగింపు



కావేరమ్మపేటలో పోతురాజుల విన్యాసాలు

రాజీవ్‌గాంధీ విగ్రహం ఆవిష్కరణ



రాజీవ్‌గాంధీ విగ్రహ ఆవిష్కరణలో ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు

సాక్షినెట్‌వర్క్: జిల్లా కేంద్రంలో మంగళవారం మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ జయంతి నిర్వహించారు. అశోక్‌టాకీస్ చౌరస్తాలోని జలసౌధ సమీపంలో ఆయన విగ్రహాన్ని ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం మధుసూదన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఐటీ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చింది రాజీవ్‌గాంధీయేనని అన్నారు. 18 ఏళ్లకు ఓటు హక్కు కల్పించారని కొనియాడారు. ఎమ్మెల్యే యెన్నం టెక్నాలజీ స్ఫూర్తి ప్రదాత రాజీవ్‌గాంధీ అని అన్నారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్, నాయకులు పాల్గొన్నారు.

- మహమ్మదాబాద్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు కేఎం నారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి రాములు, డీసీసీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- గండేడ్‌లో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు ఆశన్న, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కోట్యానాయక్, మాజీ సర్పంచులు గోపాల్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- నవాబుపేటలో నాయకులు బంగ్ల రవి, మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.
- మిడ్జిల్‌లో నాయకులు అల్వాల్‌రెడ్డి, గౌస్, సాయిలు, వెంకటేష్‌గౌడ్, చంద్రమౌళి, ఆదాం, జహీర్ తదితరులు పాల్గొన్నారు.



నవాబుపేటలో..

- అడ్డాకులలో పార్టీ మండలాధ్యక్షుడు తోట శ్రీహరి, నాగార్జున్‌రెడ్డి, విజయమోహన్‌రెడ్డి, షఫీ, తిరుపతయ్య, శ్రీనివాస్‌రెడ్డి, సాయిరెడ్డి పాల్గొన్నారు.
- కొకుంట్ల మండలం పేరూర్‌లో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్ సాగర్, శ్రీను యాదవ్, తిరుపతి గౌడ్, కిష్టారెడ్డి, రమేష్, ఆంజనేయులు. తదితరులు పాల్గొన్నారు.
- భూత్పూర్‌లో పార్టీ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకట్ నర్సింహారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాములు, గోవర్ధన్‌గౌడ్, రఘుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.
- హన్వాడలో అధ్యక్షుడు మహేందర్, నాయకులు కృష్ణయ్య, వెంకటయ్య, యాదవరెడ్డి, కలీం, సత్యం, సుధాకర్, నరేందర్, రాములు, పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారిగా నరేందర్

మహమ్మదాబాద్: మండల వ్యవసాయాధికారిగా నరేందర్ బాధ్యతలు తీసుకున్నారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన కృపాకర్‌రెడ్డి జిల్లా కార్యాలయానికి వెళ్లగా.. గండేడ్ వ్యవసాయాధికారి ఫనీషాకు ఇంచార్జి బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం రాజాపూర్ నుంచి నరేందర్ వచ్చారు.

అడ్డాకుల: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఇటీవల అడ్డాకుల వ్యవసాయాధికారిగా పని చేస్తూ బదిలీపై మహబూబ్‌నగర్ అర్బన్‌కు వెళ్లిన పి.శ్రీనివాసులుకు సన్మానించారు. మండలానికి కొత్తగా వచ్చిన వ్యవసాయాధికారి భ్యాలాను సత్కరించారు. సింగిల్‌విండో అధ్యక్షుడు ఎం.జితేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, భీమన్నయాదవ్, వేణుయాదవ్, దయాకర్, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

జీతాలు ఇవ్వకపోతే సమ్మె తప్పదు



మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఏడాది కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించకపోతే ఈ నెల 26 నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లవెల్లి కురుమూర్తి, వెంకటేశ్‌గౌడ్‌లు హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం డీపీఓ పార్థసారథి, డీఎల్‌పీఓ పండరీనాథ్‌లను కలిసి పెండింగ్ జీతాలు చెల్లించాలని వినతిపత్రం ఇచ్చారు.